

అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం ఉండదు: వైసిపి

శ్రీకాకుళం: మూడు పట్టభద్రుల నియోజకవర్గాల ఎమ్మెల్సీలను గెలిచిన టిడిపి అప్పుడే గాలిమేడలు కట్టేస్తోందని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో విమర్శించారు. శాసనసభ ఎన్నికల్లో ఇక తమకు ఎదురులేదనే విధంగా సొంత మీడియాలో, సోషల్ మీడియాలో చంకలు గుద్దుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ ఫలితం అసెంబ్లీ ఎన్నికలపై ఎలాంటి ప్రభావం చూపబోదని తెలిపారు. స్థానిక సంస్థల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలను వైసిపి గెలిచిందని గుర్తుచేశారు. టిడిపి రెండో ప్రాధాన్యతా ఓట్లతో గట్టెక్కిందని, అందులోనూ పిడిఎఫ్ నుంచి ఓట్లు బదిలీ కావడంతో గెలిచిన విషయాన్ని టిడిపి నాయకులు మరిచిపోతున్నారని పేర్కొన్నారు. 2007లో ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి గెలిచినా 2009 సాధారణ ఎన్నికలపై వాటి ప్రభావం పడలేదని తెలిపారు. ఈ ఎన్నికలు అన్ని వర్గాలకు ప్రాతినిధ్యం వహించేది కాదని పేర్కొన్నారు. పార్టీ గుర్తు మీద జరిగిన అన్ని ఎన్నికల్లోనూ వైసిపి 98 శాతం విజయాలు సాధించిన విషయాన్ని ఇక్కడ మర్చిపోరాదని తెలిపారు.



శ్రీకాకుళం: ర్యాలీగా వస్తున్న అంగన్వాడీలు



ఇచ్ఛాపురం: తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీలు

అంగన్వాడీల ఆగ్రహం

- 'చలో విజయవాడ' నిర్బంధంపై నిరసన
- కలెక్టరేట్ వద్ద మహాధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, ఫేస్ యాప్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన చలో విజయవాడకు వెళ్లనీయకుండా రాష్ట్ర ప్రభుత్వ నిర్భంధంపై అంగన్వాడీల్లో ఆగ్రహం పెల్లుబికింది. చలో విజయవాడకు వెళ్లకుండా అడ్డుకున్నా తమ నిరసనను తెలియజేసేందుకు జిల్లా నలుమూలల నుంచి జిల్లా కేంద్రానికి తరలివచ్చారు. ఆర్అండ్‌బి బంగ్లా నుంచి పెద్దపెట్టున నినాదాలు చేస్తూ కలెక్టరేట్ వరకు ర్యాలీగా వచ్చారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద సోమవారం మహా ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కె.నాగమణి మాట్లాడుతూ అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, గ్రాట్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. చలో విజయవాడకు వెళ్లకుండా అంగన్వాడీలపై నిర్బంధాన్ని ప్రయోగించి వైసిపి ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అంగన్వాడీలకు సకాలంలో వేతనాలు, బిల్లులు చెల్లించడం లేదని విమర్శించారు. తెలంగాణ కన్నా అదనంగా రూ.వెయ్యి వేతనం పెంచుతామన్న ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి హామీ నీటి మీద రాతగా మిగిలిందన్నారు. అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరినా రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. రకరకాల యాప్‌లు తెచ్చి పనిభారం పెంచారని, పర్యవేక్షణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని చెప్పారు. పుండు మీద కారం చల్లినట్లు ప్రస్తుతం ఫేస్ యాప్ అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తున్నారని తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని అంగన్వాడీలు ఆందోళన చేసినా ప్రభుత్వంలో ఏమాత్రం చలనం రాలేదన్నారు. మోడీ ప్రభుత్వం 2023-24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకి అనుకూలంగా ఉందని, 26 లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లతో పాటు కోటి మందిగా ఉన్న స్కీమ్ వర్కర్లను మోడీ ప్రభుత్వం మోసం చేసిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్‌లో అంగన్వాడీ వేతనాల పెంపు లేదని, 2017 నుండి టిఎ బిల్లులు చెల్లించడం లేదని చెప్పారు. సంవత్సరం పైగా సెంటర్ అద్దెలు చెల్లించడానికి నిధుల్లేవన్నారు. అంగన్వాడీ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా సచివాలయాల పర్యవేక్షణలోకి తీసుకురావాలని నిర్ణయం చేసిందన్నారు. అంగన్వాడీ కేంద్రాలను ఐసిడిఎస్ అధికారులు పీడీ, సిడిపిఒ, సూపర్‌వైజర్లు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సచివాలయాల పర్యవేక్షణ, ఫుడ్ కమిషనర్, ఎంఎస్‌కె, తహశీల్దార్, ఎంపిడిఒ, రాజకీయ నాయకులు ఇలా అనేకమంది విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ వేధింపులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కీమ్ వర్కర్లు అనేక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. సంపూర్ణ పోషణ మెనూ ఛార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, 2017 నుంచి పెండింగ్‌లో ఉన్న టిఎ బిల్లులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.ఐదు లక్షలు ఇవ్వాలని, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలన్నారు. రాజకీయ వేధింపులు ఆపాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలు, సభలను నిషేధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జిఒ నంబరు 1ని రద్దు చేయాలన్నారు. కార్మికులందరూ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ధర్నాలో సిఐటియు జిల్లా కోశాధికారి ఎ.సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షులు కె.సూరయ్య, ఎం.ఆదినారాయణమూర్తి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి కె.కళ్యాణి, నాయకులు ఎన్.హైమావతి, జె.కాంచన, బి.కనకం, విజయలక్ష్మి, రాజేశ్వరి, కె.ప్రమీల, శారద తదితరులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసిడిఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్వాడీలు ధర్నా చేపట్టారు. అనంతరం అక్కడ నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు విజయలక్ష్మి మాట్లాడుతూ మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలపై రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. అనంతరం తహశీల్దార్ గురుప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు హైమావతి, ఢిల్లేశ్వరి, బాలామణి, నరసమ్మ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్ : ఆందోళన చేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

నేటి నుంచి వర్క్ టు రూల్

అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ ఉద్యోగులపై ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని నిరసిస్తూ ఉద్యమ కార్యాచరణలో భాగంగా మంగళవారం నుంచి వచ్చే నెల 5వ తేదీ వరకు వర్క్‌టు రూల్ పాటించాలని అమరావతి జెఎసి జిల్లా చైర్మన్ కె.శ్రీరాములు పిలుపునిచ్చారు. తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనకు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో నిరశన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ణీత కాలంగా ఉన్న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు మాత్రమే విధులు నిర్వర్తించాలన్నారు. సమయపాలన కచ్చితంగా పాటిస్తూ ఉద్యోగుల ఐక్యతను చాటి చెప్పాలన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి బివివిఎన్ రాజు, జి.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పోలాకి : ఆందోళన చేస్తున్న ఉద్యోగులు

ఇచ్ఛాపురం: రెవెన్యూ ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలు పరిష్కారించే వరకూ పోరాడుతామని ఎపి జెఎసి మండల ప్రెసిడెంట్ కె.శ్రావణ్‌కుమార్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద నల్ల రిబ్బన్లు ధరించి ఆందోళన చేపట్టారు. మంగళవారం నుంచి 'వర్క్ టూ రూల్' ప్రకారం ప్రభుత్వ పని గంటల్లో మాత్రమే పని చేయాలని నిర్ణయించామన్నారు. డిఎ, ఎరియర్స్, పిఆర్‌సి ఎరియర్స్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.గురుప్రసాద్, డిటి కె.సంతోష్‌కుమార్, పి.నాని, సర్వేయర్ తవిటినాయుడు పాల్గొన్నారు.

పోలాకి: ప్రభుత్వం ఉద్యోగుల కోరిన డిమాండ్లను పరిష్కరించాలని అమరావతి జెఎసి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె.శ్రీరాములు డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం ఎదుట నల్లబ్యాడ్జీలు పెట్టుకుని సోమవారం నిరశన తెలిపారు. కార్యక్రమంలో డిటీ పి.శ్రీనివాసరావు, ఆర్ఐ కోటీశ్వరావు, సూపరింటెండెంట్, మండల సర్వేయరు, ఉద్యోగులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకం

బిఆర్ఎయు విసి నిమ్మ వెంకటరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

జిల్లా సమగ్రాభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థలు కీలకపాత్ర పోషించాలని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్, ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వరల్డ్ సోషల్ వర్క్ డే సందర్భంగా అంబేద్కర్ యూనివర్శిటీ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో సెమినార్ హాల్‌లో సోమవారం 'సామాజిక అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విసి మాట్లాడుతూ సామాజిక అభివృద్ధిలో స్వచ్ఛంద సంస్థల పాత్ర కీలకమన్నారు. జిల్లాలో ఉత్పత్తి చేస్తున్న ఎన్నో వస్తువులు నాణ్యతా ప్రమాణాలు ప్రకారం ఎంతో పేరొందాయని, దీన్ని ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు మరింత ప్రచారం అవసరమన్నారు. మందస పాలకోవ, పలాస జీడిపప్పు, ఉద్దానం కొబ్బరి, బుడితి కంచు, బెజ్జిపురం జ్యూట్ ఉత్పత్తులు, పొందూరు ఖాదీ లాంటి వస్తువులకు ఇదే ప్రాంతంలో ఎంతో గిరాకీ ఉన్నా దీనిని ప్రపంచ స్థాయిలో నిలిపేందుకు బ్రాండ్ ఇమేజ్, ట్రేడింగ్, జియో ట్యాగింగ్ లాంటి అంశాలన్నింటికీ తగిన ప్రాధాన్యత ఇవ్వగలిగినప్పుడే వీటికి రేటింగ్ ఉంటుందన్నారు. పొందూరు ఖాదీని నాటి ఎంపీ బొడ్డేపల్లి రాజగోపాలరావు, నాటి ప్రధానులు నెహ్రూ, ఇందిరాగాంధీలకు సమర్పించి చరిత్రలో నిలిచిపోయారని గుర్తుచేశారు. జిల్లాలో నడుస్తున్న పలు పరిశ్రమల్లో ఉద్యోగులకు అవసరమైన రీతిలో కొన్ని కోర్సులు రూపొందించామని, వీటిని ఇప్పటికే ఉద్యోగులు, యువత సద్వినియోగం చేసుకుంటున్నారని చెప ్పారు. యూనివర్శిటీ రిజిస్ట్రార్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సమాజం కోసం ఎన్నో సేవా సంస్థలు పనిచేస్తున్నాయని, సంస్థ ప్రతినిధుల అనుభవాలను తెలుసుకోవడంతో పాటు జిల్లా అభివృద్ధికి పలు సూచనలు వర్కుషాపు ద్వారా స్వీకరించనున్నామన్నారు. వర్శిటీ సోషల్ వర్క్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ అనురాధ, కంచరావు తారక రామారావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో వైసిబి డైరెక్టర్ ఎం.ప్రసాదరావు, ఆర్డ్స్ డైరెక్టర్ నూక సన్యాసిరావు, స్వీప్ డైరెక్టర్ కొమ్ము రమణమూర్తి, కొంక్యాన గోవిందరాజులు చారిటబుల్ ట్రస్టు డైరెక్టర్ కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ బిఆర్ఎయుకు చెందిన డాక్టర్ కావ్య జ్యోత్స్న, వనజ, కె.శ్యామల, శ్రీప్రగతి మహిళా మండలి అధ్యక్షురాలు కోట సావిత్రమ్మ, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కె.ఎన్.స్వామి, టి.రాజారావు, యు.ప్రసాద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పలాస: పిచ్చుక ఆకారంలో కూర్చొన్న విద్యార్థులు

జీవ వైవిధ్యానికి పిచ్చుకలు దోహదం

(6లో)

జీడికి మద్దతుధర ప్రకటించాలి

- ఆర్‌బికెల ద్వారా ప్రభుత్వమే పంటలు కొనాలి
- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జీడి బస్తా(80 కేజీల)కు రూ16 వేలు మద్దతుధర ప్రకటించి, ప్రభుత్వమే రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల నుంచి కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు డిమాండ్ చేశారు. సోమవారం నగరంలోని సుందరయ్య భవనంలో జిల్లా సహాయ కార్యదర్శి పి.చందరరావు అధ్యక్షతన ఎపి రైతు సంఘం జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 70శాతం మంది ప్రజలు ఆధారపడి జీవిస్తున్న వ్యవసాయరంగాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి తగిన నిధులు కేటాయించలేదన్నారు. రైతులు పండించిన ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయక పోవడంతో దళారులకు అమ్మాల్సిన దుస్థితి ఏర్పడిందని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో అకాల వర్షాలకు నష్టపోయిన మొక్కజొన్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పండిన అన్ని రకాల పంటలకూ స్వామినాథన్ కమిటీ సిఫార్సు ప్రకారం మద్దతుధర నిర్ణయించి, ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న వైఖరి వల్లే తీవ్రంగా నష్టాలబారిన పడుతున్నారని అన్నారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె కొండయ్య, టి.రామకృష్ణారావు, బి.వాసు, కె.బాలాజీ, కె.హేమసూధన, పి.భాస్కరరావు, టి.నందోడు, కె.పుణ్యవతి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కె.మోహనరావు

సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

సాగునీటి ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండ్ చేశారు. సోమవారం టెక్కలిలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులకు సరిపడా నిధులు కేటాయించలేదని అన్నారు. వంశధార ప్రాజెక్టుకు రూ. 763.12 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదించగా ప్రభుత్వం రూ.193.98 కోట్లు మాత్రమే కేటాయించిందని, ఆఫ్‌షోర్‌కు రూ.231 కోట్లు కావాలని కోరగా రూ.9.36 కోట్లు కేటాయించిందని, అరకొరగా నిధుల కేటాయింపు వల్ల ఉపయోగం ఏమీ లేదని అన్నారు. గ్రామీణ, పట్టణ అభివృద్ధికి నిధులు తగ్గాయని, అమ్మఒడి లబ్ధిదారుల సంఖ్యను కుదించారని తెలిపారు. ఉపాధి హామీ బకాయిలు చెల్లించలేదని, కార్మికులకు కనీస వేతనాల ప్రస్తావన, కాంట్రాక్ట్ కార్మికులు, ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ప్రస్తావన, డిఎస్‌సి నియామకాల ప్రస్తావన లేదు అని గోవిందరావు అన్నారు. ఉన్నత విద్యకు పూర్తిస్థాయి రీయంబర్స్‌మెంట్ చెల్లించాలని, భవన నిర్మాణ కార్మికులకు ప్రత్యేక పథకం పెట్టి, వారి సంక్షేమ నిధిని వారికే ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేటు ఉపాధ్యాయుల సంక్షేమ చట్టం చేయాలని, విశాఖ ఉక్కు ప్రయివేటీకరణను ఆపడంపై ప్రస్తావించలేదని చెప్పారు. పరిశ్రమల్లో ఉపాధి పెరగలేదు. కొత్త పరిశ్రమలు లేవని అన్నారు. ప్రజలపై పన్నుల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ నాయకులు నంబూరు షణ్ముఖరావు, హెచ్ ఈశ్వరరావు, కొల్లి యల్లయ్య, కె.గణేష్, ఎం.శివ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు

వారిని ఆప్కాస్‌లో ఎలా చేరుస్తారు?

- కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన ఉద్యోగులు
- స్పందనలో 170 వినతుల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతిగృహాల్లో కోవిడ్‌కు ముందు పనిచేసిన కుక్, హెల్పర్, శానిటేషన్ వర్కర్స్ అర్థాంతరంగా పని మానేశారని, వారి పేర్లను ఆప్కాస్‌లో చేర్చి, ప్రస్తుతం పనిచేస్తున్న వారికి ఆ శాఖ అధికారులు అన్యాయం చేస్తున్నారని పలువురు ఉద్యోగులు కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ దృష్టికి తెచ్చారు. సోమవారం జెడ్‌పిలో నిర్వహించిన స్పందనలో కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎస్ శంకరరావు, పి.లక్ష్మీనాయుడు, ఎం.కుమార్‌స్వామి మాట్లాడుతూ కేటరింగ్ పద్ధతిలో చేపట్టిన ఈ నియామకాల్లో 2020 నుంచి పని చేస్తున్న వారికి అన్యాయం జరుగుతోందని అన్నారు. తక్షణమే ఉన్నత స్థాయి అధికారులతో చర్చించి, న్యాయం చేయాలని కోరారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్

దేవరాపల్లిలో నీటివాగులు అక్రమణకు గురయ్యాయని, వీటిని తొలగించాలని రణస్థలం మండలం వేల్పూరాయికి చెందిన బాలి రామునాయుడు అర్జీ సమర్పించారు.

జగనన్న కాలనీలో ఇల్లు కట్టుకుంటున్నానని, తన పక్క ఇంటివారు తనకు చెందిన స్థలాన్ని అక్రమించారని, తనకు న్యాయం చేయాలని ఆముదాలవలస మండలం కొత్తవలసకు చెందిన డి.రామారావు స్పందనలో ఫిర్యాదు చేశారు.

తన పేరుతో ఉన్న భూమికి 1బి ఇప్పించాలని అలికాం పంచాయతీ లింగాలవలసకు చెందిన మెండ దాలమ్మ కోరింది.

భూసమగ్ర సర్వేలో తనకున్న భూముల వాస్తవ పరిస్థితికి భిన్నంగా సర్వే నిర్వహించారని పాత టెక్కలికి చెందిన పిరియా వెంకటరమణ ఫిర్యాదు చేశారు. సర్వేలో లోపాలను సరిదిద్ది, తనకు న్యాయం చేయాలని కోరారు.

లావేరు మండలం బెజ్జిపురానికి చెందిన చివికి సుధాకరరావు అర్జీ సమర్పిస్తూ గ్రామంలో విచారణ జరిపించి, తన భూమిని హద్దులతో అప్పగించాలని కోరారు.

శ్రీకాకుళం నగరంలోని హయాతినగరానికి చెందిన దాసరి వాసుదేవరావు ఫిర్యాదు చేస్తూ నా తండ్రి చనిపోయి నేటికీ ఐదు నెలలు గడుస్తున్నా మరణ ధ్రువీకరణ పత్రం ఇవ్వకుండా సచివాలయ ఉద్యోగులు ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపాడు.

పలాస మండలంలోని బ్రాహ్మణతర్లలో సర్వే నంబరు 56/2 చెరువును గ్రామానికి చెందిన కొంతమంది ఆక్రమించుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ఎంపిటిసి మాజీ సభ్యులు గరుగు సింహాచలం, దళిత సంఘం నాయకుడు వడ్డీ యాదగిరి కోరారు. కలెక్టర్‌కు స్పందనలో కలిసి వినతిపత్రం అందించారు. పంట పొలాల మట్టిని ప్రొక్లెయినర్‌తో తవ్వి ట్రాక్టర్లతో చెరువును కప్పేస్తున్నారని తెలిపారు. ఈ విషయం పలాస తహశీల్దార్‌కు చెప్పినా పట్టించుకోలేదని అన్నారు. కలెక్టర్ స్పందిస్తూ తహశీల్దార్‌కు ఫోన్ చేసి మట్టి వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినతిపత్రం అందజేసిన వారిలో గరికి కృష్ణారావు, రాజారావు, ప్రదీప్, టి.కృష్ణారావు ఉన్నారు. మొత్తం జిల్లా వ్యాప్తంగా 170 వినతులు వచ్చాయి.

నిర్ణీత వ్యవధిలో పరిష్కారం

స్పందనలో వస్తున్న వినతుల పరిష్కారంలో నాణ్యతా ప్రమాణాలు పాటించి, నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ అధికారులను ఆదేశించారు. స్పందనలో స్వీకరించే ప్రతి దరఖాస్తును 24 గంటల్లో ఓపెన్ చేసి పరిష్కరించడమా? లేదా తిరస్కరించడమా? అనే అంశాలపై వివరణ ఇవ్వాలన్నారు. తిరస్కరించదలిస్తే సరైన కారణాలు తెలపాలన్నారు. మండల స్థాయిలో ఈ ప్రక్రియ మరింత ప్రతిష్టాత్మకంగా జరగాలన్నారు. నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవి, డిఆర్‌డిఎ పీడీ విద్యాసాగర్, జెడ్‌పి సిఇఒ వెంకటరామన్, డిఎంఅండ్‌హెచ్‌ఒ బి.మీనాక్షి, డిఎస్ఒ వెంకటరమణ, డిపిఒ రవికుమార్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కొత్తూరులో వడగళ్ల వాన



కొత్తూరులో కురిసిన వడగళ్ల వాన

ప్రజాశక్తి - కొత్తూరు

అల్పపీడన ద్రోణి కారణంగా జిల్లాలో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం కొత్తూరులో అరగంట పాటు వడగళ్ల వాన కురిసింది. బూర్జ, సరుబుజ్జిలి, శ్రీకాకుళం, కొత్తూరు, పోలాకి, ఆమదాలవలస, రణస్థలంలో మోస్తరుగా వర్షం కురిసింది. ఉదయం అంతా ఎండ ఎక్కడంతో వర్షాలు తగ్గాయని అంతా భావించారు. మధ్యాహ్నం ఆకాశం మేఘావృతమై వర్షాలు కురిశాయి. కొత్తూరులో సోమవారం మధ్యాహ్నం 3గంటల సమయంలో వడగళ్ల వాన కురవడంతో ద్విచక్ర వాహనదారులు వాహనాలను రోడ్డుపై నిలిపివేసి, పక్కనున్న భవనాల కిందకు వెళ్లారు. ఈ వాన వల్ల జీడి, మామిడి పంటలు దెబ్బతిన్నాయి. ఉగాదికి మామిడి కాయలకు మంచి డిమాండ్ ఉంటుంది. ఈ తరుణంలో మామిడి కాయలు రాలిపోవడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు.

వసతిగృహంలోకి వర్షపునీరు

కొత్తూరు సాంఘిక సంక్షేమశాఖ బాలుర వసతిగృహంలోకి వర్షపునీరు చేరింది. దీంతో విద్యార్థుల పుస్తకాలు, దుప్పట్లు తడిచిపోయాయి. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. హాస్టల్ ఆవరణం అంతా నీటితో నిండిపోయింది. స్పందించిన వసతిగృహ అధికారులు గోడను తవ్వి, నీటిని దిగువకు మళ్లించారు.



వసతిగృహంలోకి చేరిన వర్షపునీరు

ఉద్యోగాలను కొనసాగించాలి


ఆందోళన చేస్తున్న సాంకేతిక సహాయకులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్, రూరల్ డవలప్‌మెంట్‌వ విభాగాల్లో రెండు దశాబ్దాలకు పైగా పనిచేస్తున్న సాంకేతిక సహాయకులను ఏప్రిల్ 1 నుంచి ఉద్యోగాల నుంచి తొలగిస్తామని ప్రకటించడం అన్యాయమని, తిరిగి యథాస్థితిలో ఉద్యోగాలు కొనసాగించాలని పంచాయతీరాజ్ అవుట్ సోర్సింగ్ టెక్నికల్ అసిస్టెంట్ల సంఘం అధ్యక్షులు బి.వి.రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు జెడ్‌పి కార్యాలయం ఆవరణలోని పంచాయతీరాజ్ ఎస్ఇ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 74 మంది సాంకేతిక సహాయకులు, 12 మంది కంప్యూటర్ ఆపరేటర్లు పనిచేస్తున్నారని అన్నారు. ఆర్‌డి కమిషనర్ నుంచి మౌఖిక ఆదేశాలు వచ్చాయని అన్నారు. 14 నెలలుగా వేతనాలూ చెల్లించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కాస్ పరిధిలో చేరినా, సక్రమంగా తమకు జీతాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు టి.గోవింద, బి.రవికుమార్, డి.మురళీకృష్ణ, ఎస్.అప్పలనాయుడు, ఆర్.రమణ, వై.వెంకటరమణ, ఆర్.లక్ష్మణరావు పాల్గొన్నారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

డిఆర్‌ఒను కోరిన ఎపి రైతు సంఘం


డిఆర్‌ఒ రాజేశ్వరికి సమస్యను వివరిస్తున్న గిరిజనులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

మెళియాపుట్టి మండలం నందవ రెవెన్యూ పరిధిలోని గిరిజనుల సాగులో ఉన్న భూములు తప్పుడు పట్టాలు సృష్టించి, పెత్తందారులు ఆక్రమించుకున్నారని, తక్షణమే వారిపై చర్యలు తీసుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు, జిల్లా సహాయ కార్యదర్శి పి.చందరరావు అన్నారు. సోమవారం డిఆర్‌ఒ రాజేశ్వరిని ఆమె కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నందవ రెవెన్యూ పరిధిలోని నందవ కొత్తూరు, పెద్దమడికి చెందిన 35 గిరిజన కుటుంబాలు 50 ఏళ్లుగా వరి, జొన్న, రాగులు, కందులు, వరి, తదితర పంటలను సాగు చేసుకొని జీవిస్తున్నారని అన్నారు. సర్వే నెంబరు 64/2, 64/2ఎ,, 68/1, 68/3లోని భూములను గిరిజనేతరులు ఆక్రమించి, ప్రొక్లెయినరు, ట్రాక్టర్లతో గిరిజనుల పంటలను నాశనం చేస్తున్నారని, తక్షణవే ఆక్రమణలను అడ్డుకొని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. గిరిజనుల సాగులో ఉన్న భూములను పరిశీలించి, వీరికి పట్టాలు ఇవ్వాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో జె.రామకృష్ణుడు, ఎస్.విమలకుమారి, సింహాచలం, పి.రోహిణి, తదితరులు ఉన్నారు.


గుప్పెడు బియ్యం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, జెసి

గుప్పెడు సహాయం కొండంత అండ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గుప్పెడు సహాయం కొండంత అండ అని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్, జెసి ఎం.నవీన్ అన్నారు. పేద కుటుంబాలకు అండగా నిలిచేందుకు మెప్మా ఆధ్వర్యాన స్వయం సహాయక సంఘాలు గుప్పెడు బియ్యం సేకరణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో పలాస, ఇచ్ఛాపురం, ఆముదాలవలస మున్సిపాలిటీ, శ్రీకాకుళం నగర కార్పొరేషన్ పరిధిలో గుప్పెడు బియ్యం కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లాలో మెప్మా పట్టణ స్వయం సహాయక సంఘం సభ్యులు ప్రతినెలా గుప్పెడు బియ్యం పోగు చేసి పేదలకు, అనాథ శరణాలయాలకు, నిరాశ్రయ గృహాలకు అందజేయాలన్న సంకల్పన్ని అభినందించారు. జిల్లాలో నాలుగు మున్సిపాలిటీల్లో ఉగాది నుంచి ప్రారంభం కావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, ఉప కలెక్టర్ జయదేవి, మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ కిరణ్‌కుమార్, డిఆర్‌డిఎ పీడీ డి.విద్యాసాగర్, జిల్లా పరిషత్ సిఇఒ వెంకట్రామన్, డిఎంహెచ్‌ఒ బి.మీనాక్షి, డిఎస్‌ఒ వెంకటరమణ, డిపిఒ రవికుమార్ పాల్గొన్నారు.


పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్‌పి రాధిక

ఫెన్సింగ్ క్రీడాకారులకు అభినందనలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జాతీయ స్థాయి ఫెన్సింగ్ క్రీడా పోటీల్లో సత్తా చాటి విజేతలుగా తిరిగిరావాలని జిల్లా నుంచి ఎంపికైన సీనియర్ క్రీడాకారులకు ఎస్‌పి జి.ఆర్.రాధిక పిలుపునిచ్చారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు బయలు దేరుతున్న బడి పూజిత, ఇప్పి విభాగంలో గురుగుబెల్లి అక్షయలను సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడలూ అవసరమన్నారు. జిల్లా పేరు ప్రతిష్ఠలను ఇనుమడింపజేసేలా జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో రాణించాలన్నారు. సీనియర్ జాతీయ స్థాయి పోటీలకు ఇద్దరు ఎంపికై మహారాష్ట్రలోని పూణె వేదికగా ఈ నెల 24 నుంచి 28 వరకూ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో తైక్వాండో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అడంగల్, 1బి మంజూరు చేయాలి


ఆర్‌డిఒకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పలాస: మండలంలోని రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో ఉన్న ఉజ్జిడి మెట్ట రైతులకు 1బి, అడంగల్ మంజూరు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్‌డిఒ టి.సీతారామ్మూర్తి, తహశీల్దార్ ఎల్.మధుసూదనరావులను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2022లో చరణ్ గ్రూప్ సంస్థ రైతుల పొలాల్లో కంకర పోసి కప్పేసిందని అన్నారు. ఈ విషయమై చరణ్ గ్రూప్ సంస్థను రైతులు నిలదీసినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల పక్షాన వాపక్షాల నాయకులు నిరాహార దీక్షలు చేపట్టారని గుర్తు చేశారు. రాష్ట్ర పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు జోక్యంతో హామీనివ్వడంతో నిరాహార దీక్షలు విరమింపజేశామని చెప్పారు. ఏడాది అక్టోబరు 2 నాటికి అడంగల్, 1బి రైతులకు ఇచ్చి న్యాయం చేస్తామని హామీనిచ్చారని అన్నారు. నెలలు గడుస్తున్నా ఇప్పటికీ అడంగల్, 1బి ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం, రెవెన్యూ అధికారులు స్పందించి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై స్పందించిన ఆర్‌డిఒ, తహశీల్దార్‌లు మాట్లాడుతూ వారం రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో వామపక్షాల నాయకులు సిహెచ్.వేణుగోపాల్, వంకల మాధవరావు, ఎన్.గణపతి, పి.నాగేశ్వరరావు, జి.బాలకృష్ణ, రైతులు తేజ, నీలవేణి పాల్గొన్నారు.

మత్స్యకార సంఘాల బలోపేతమే లక్ష్యం


మాట్లాడుతున్న శ్రీనివాస్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మూడు రోజుల శిక్షణలో తెలుసుకున్న అంశాలను ఆచరణలో చూపి మత్స్యకార సహకార సంఘాలు ఆర్థికాభివృద్ధి చెందాలని మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.వి.శ్రీనివాస్ ఆకాంక్షించారు. నేషనల్ సెంటర్ ఫర్ కో-ఆపరేటివ్ ఎడ్యుకేషన్, న్యూఢిల్లీ ఆధ్వర్యాన రాష్ట్ర సహకార యూనియన్, రామదాసు సహకార శిక్షణా కేంద్రం సంయుక్తంగా నగరంలోని ఎన్‌జిఒ హోమ్‌లో నిర్వహిస్తున్న లేబర్స్ కాంట్రాక్టు సహకార సంఘాల చైర్మన్లు, పాలకవర్గ సభ్యుల శిక్షణ సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వం ద్వారా నిధులు, రుణాలు మంజూరు కావాలంటే సంఘాల రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. అనంతరం మంచి ఫలితాలు సాధిస్తున్న డిసిఎంఎస్‌ను సందర్శించారు. బృందానికి డిసిఎంఎస్ చైర్మన్ చల్లా సుగుణ, అసిస్టెంట్ రిజిస్ట్రార్, బిజినెస్ మేనేజర్ లక్ష్మణరావు స్వాగతం పలికి సంఘ బలోపేతానికి, ఆర్థికాభివృద్ధి తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం రికార్డుల నిర్వహణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, రామదాసు సహకార శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ వి.శ్రీనివాస్, మత్స్యశాఖ ఎడి సంతోష్‌కుమార్, మత్స్యశాఖ అధికారి సురేష్ పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

పాఠశాలల్లో 'స్ఫూర్తి'

సోంపేట : మండలంలోని పలాసపురం, సోంపేట వివేకానంద పాఠశాలల్లో స్థానిక పోలీసులు సోమవారం స్ఫూర్తి కార్యక్రమాలను నిర్వహించారు. మహిళల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మహిళల రక్షణ కోసం ఉన్న చట్టాలు, ఇతర అంశాలను గురించి తెలియజేశారు. అలాగే బుషికుద్దలో నాటిక ద్వారా స్ఫూర్తి కార్యక్రమాన్ని ప్రచారం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతారాంకు ఉగాది పురస్కారం


శాంతారాం

పొందూరు: సామాజికవేత్త, రెడ్‌క్రాస్ రాష్ట్ర సభ్యులు కాళ్లకూరి శాంతారాంకు స్థానిక నవతాగ్రంథాలయం సంస్థ ఈ ఏడాదికి ఉగాది పురస్కారానికి ఎంపిక చేసింది. నటుడిగా, దర్శకుడిగా నాటక రంగానికి అందిస్తున్న సేవలకు, గతంలో ఆయన నిర్వహించిన సామాజిక కార్యక్రమాలు, ప్రస్తుతం రెడ్‌క్రాస్ ద్వారా సమాజానికి అందిస్తున్న సేవలను గుర్తించి కమిటీ ఉగాది పురస్కారానికి ఎంపిక చేసినట్లు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పి.కూర్మారావు, అట్ల మణిభూషణరావు తెలిపారు. ఉగాది రోజున నిర్వహించే కార్యక్రమంలో సత్కరించి పురస్కారాన్ని అందించనున్నారు.

నేడు ప్రజావేదిక

పొందూరు: పొందూరు ఉపాధి హామీ 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం ప్రజావేదిక నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ సీపాన హరిహరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1, 2021 నుంచి మార్చి 31, 2022 వరకూ మండలంలోని 29 పంచాయతీల్లో చేపట్టిన పనులపై ప్రజావేదికను నిర్వహిస్తున్నామని అన్నారు. ఉదయం 9 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తులకు ఆహ్వానం

జలుమూరు : మండల కేంద్రంలోని కెజిబివి పాఠశాలలో ఆరు, ఏడు, ఎనిమిది తరగతుల మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శారద కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

న్యాయవాదుల విధులు బహిష్కరణ

ఆమదాలవలస : బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యుడు ఆతూరి వెంకట భగవాన్ అక్రమ అరెస్టులు సరికాదని బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు కోర్టు ఆవరణలో సోమవారం విధులను బహిష్కరించి ఆందోళన చేపట్టారు. అక్రమ అరెస్టును నిరసిస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పైడి వరహానరసింహం, వాడవలస రాజేశ్వరరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న న్యాయవాదులు


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

మండలంలోని పైడిభీమవరం పారిశ్రామిక ప్రాంతంలోని లాడ్జిలో వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుడిది అహ్మదాబాద్‌కు చెందిన సోలంకి గోవింద్ బాయ్ (53)గా పోలీసులు గుర్తించారు. కాగా, మృతుడు స్థానికంగా ఉన్న డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమలో ఏమైనా సమస్యలు వస్తే వాటిని మరమ్మతులు చేపడుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇందులో భాగంగా ఈ నెల 13న పరిశ్రమకు వచ్చి మరమ్మతులు చేపట్టి వెళ్లిపోయారని యాజమాన్య ప్రతినిధులు తెలిపారు. అయితే గత శనివారం మధ్యాహ్నం నుంచి అతని ఫోన్ చేస్తే... రింగ్ అవుతున్నా ఎత్తడం లేదని పరిశ్రమ ప్రతినిధులు తెలిపారు. అనుమానం వచ్చి లాడ్జికి ఫోన్ చేసి ఆరా తీశారు. లాడ్జీ సిబ్బంది సోమవారంగోవింద్ బాయ్ ఉంటున్న రూమ్‌కు వెళ్లి తలుపు కొట్టారు. ఎప్పటికీ తీయకపోవడంతో వెనుక ఉన్న కిటికీ అద్దాలు బద్దలు కొట్టి లోపలకు వెళ్లి చూడగా మృతి చెంది ఉన్నారు. మృతదేహం కుళ్లిపోయి కనిపించింది. వెంటనే జె.ఆర్.పురం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ జి.రాజేష్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని వివరాలను సేకరిస్తున్నారు. పక్కనే మొబైల్ ఫోన్ ఉండటంతో ఛార్జింగ్ పెట్టే సమయంలో షాకుకు గురై మృతి చెంది ఉంటాడని ప్రాథమికంగా అంచనా వేశారు. శ్రీకాకుళం నుంచి క్లూస్ టీం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరిస్తుంది. మిగతా వివరాలు ఇంకా తెలియ రావాల్సి ఉంది.


బియ్యం స్వాధీనం చేసుకున్న విజిలెన్స్ అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

సరుబుజ్జిలి : సరుబుజ్జిలి కూడలిలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. బూర్జ మండలానికి చెందిన వండాన చిన్నం నాయుడు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి వాహనంలో 3,500 కేజీలు తరలిస్తున్నారు. విజిలెన్స్ ఎస్‌పి సురేష్‌బాబుకు సమాచారం అందడంతో సరుబుజ్జిలి కూడలిలో మాటువేసి పట్టుకున్నామని విజిలెన్స్ ఎస్ఐ అశోక్ తెలిపారు. వీటి విలువ రూ.1.33 లక్షలు ఉంటుందని అంచనా వేశామన్నారు. బియ్యాన్ని సీజ్ చేసి గొడౌన్‌కు, వాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు. ఈ దాడుల్లో సివిల్ సప్లయి డిటి రామకృష్ణ, విఆర్‌ఒ ధర్మారావు, హెడ్ కానిస్టేబుల్ అప్పన్న, పిసిలు సిహెచ్.శేషగిరిరావు, ఐ.ఈశ్వరరావు పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

ఆమదాలవలస : శ్రీశోభ కృతు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని విశ్వ సాహితీ కార్యదర్శి కర్నేన జనార్ధనరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ నెల 22న సాయంత్రం 5 గంటలకు విశ్వసాహితీ ఆధ్వర్యాన పట్టణంలోని బి.ఆర్.నగర్‌లోని పొన్నాడ అప్పల నరసమ్మ - చిన్నవాడు గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. పివిఎన్ మాస్టారు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉగాది ప్రాముఖ్యత గురించి కుప్పిలి చంద్రమౌళి, ముట్నూరు సుబ్రహ్మణ్యం మాస్టార్లు ప్రసంగిస్తారని అన్నారు. అనంతరం ఉగాది స్వీయ కవితా పఠనం నిర్వహించి కవులు తమ కవితా పఠనంతో సభను రంజింప చేస్తారని తెలిపారు. సాహిత్యాభిమానులు, విశ్రాంత ఉద్యోగులు, సామాజిక సేవకులు, విద్యార్థులు విరివిగా పాల్గొని కవి గాయకులను ప్రోత్సహించాలని కోరారు.


ఎంపికైన విద్యార్థులు

'హెటిరో'కు 33 మంది ఎంపిక

శ్రీకాకుళం అర్బన్ : నగరంలోని కాకినాడ శ్రీఆదిత్య డిగ్రీ కళాశాలలో హెటిరో డ్రగ్స్ ఆధ్వర్యాన సోమవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో 33 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారు. బిఎస్‌సి కెమిస్ట్రీ విభాగం నుంచి 40 మంది హాజరయ్యారు. వీరిలో 33 మంది విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ బరాటం శ్రీనివాస చక్రవర్తి, ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్‌లు తెలిపారు. తమ కళాశాలలో వివిధ విభాగాల డిగ్రీ విద్యార్థులకు ఎన్నో ప్రముఖ సంస్థల క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని అన్నారు. ఇప్పుడు తమ కళాశాల విద్యార్థులు 33 మంది హెటిరో డ్రగ్స్ వంటి ప్రముఖ సంస్థలో ఎంపిక కావడం అభినందనీయమన్నారు. ఎంపికైన వారికి ఏడాదికి రూ.2.7 లక్షల వార్షిక వేతనంతో పాటు ఉద్యోగాల్లో స్థిర పడే మంచి అవకాశం వచ్చిందన్నారు. ఎంపికైన విద్యార్థుల తల్లితండ్రులు ఆదిత్య కళాశాల అధినేత ఎన్.శేషారెడ్డిని, కళాశాల డైరెక్టర్ ఎన్.సుగుణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే

ఆమదాలవలస : పట్టణంలోని భవిత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులు సోమవారం వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎన్నారై సువ్వారి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలకు హాజరు కావాలన్నారు. అప్పుడే మంచి ఫలితాలను సాధించగలరన్నారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు ఆద్యంతం ఆహుతులను అలరించాయి. పలు సినిమాల్లోని గీతాలకు చిన్నారులు వేసిన డాన్స్‌లు పలువురిని ఆకట్టుకున్నాయి. సాంప్రదాయ నృత్యాలను సైతం ప్రదర్శించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్.మురళీధరరావు, డైరెక్టర్ ఎస్.సునీత, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


సాంప్రదాయ నృత్యాన్ని ప్రదర్శిస్తున్న చిన్నారులు


సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతి


వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రజాశక్తి- ఆమదాలవలస

రెండో నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన సచివాలయాల ఉద్యోగులకు వెంటనే ప్రొబేషన్ డిక్లేర్ చేసి సెలవులను క్రెడిట్ చేయాలని ఎపి విడబ్ల్యుఎస్‌జిఇఎ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కూన వెంకట సత్యనారాయణ కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లోని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్‌ను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెండో నోటిఫికేషన్ (2020-21)లో ఉద్యోగాలు పొందిన వారు, రెండేళ్ల ప్రొబేషన్ పిరియడ్ పూర్తి చేసుకున్న అర్హులైన సచివాలయ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ నెలాఖరులోగా ఉత్తర్వులు జారీ చేసే విధంగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారని తెలిపారు. అలాగే సచివాలయ ఉద్యోగులకు సంబంధించిన అన్ని రకాల సెలవులను వారి లాగిన్‌ల్లో అప్‌లోడ్ చేయాలని ఉందని,ఇంత వరకు జిల్లా అధికారులు వాటిని సరిచేయలేదని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బుక్క గణపతిరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డి.దుర్గాప్రసాద్, ఎస్.వినయ్ పాల్గొన్నారు.

కమిషనర్ దృష్టికి పెద్దరెల్లివీధి సమస్యలు


వినతిపత్రం అందజేస్తున్న గొండు శంకర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని పెద్దరెల్లివీధి వాసుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టిడిపి నాయకులు, సర్పంచ్‌ల సంఘ జిల్లా అధ్యక్షులు గొండు శంకర్ కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ కార్యాలయంలో కమిషనర్ చల్లా ఓబులేసును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కుళాయిలు కనెక్షన్లు లేక, తాగునీరు సకాలంలో సరఫరా కాక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్గంధంలో అవస్థలు పడుతున్నారని అన్నారు. రెండు సామూహిక మరుగుదొడ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయన్నారు. దీనిపై కమిషనర్ వెంటనే స్పందించారు. సంబంధిత సిబ్బందితో ఫోన్‌లో మాట్లాడారు. వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య చెప్పిన వెంటనే స్పందించి అధికారుల దృష్టికి తీసుకెళ్లి గంటల వ్యవధిలో పరిష్కారం చూపిన గొండు శంకర్‌కు కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అంబటి లక్ష్మీరాజ్యం, టిఎన్‌టియుసి నియోజకవర్గం అధ్యక్షులు దొండపాటి నవీన్, రెడ్డి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బొల్ల నాగేంద్ర యాదవ్, కళ్యాణరామ్, బుర్రి మధు పాల్గొన్నారు.


నిల్వ నీటిని చూపుతున్న మోహనరావు

నీరు నిల్వ లేకుండా చూడాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

పట్టణంలోని స్థానిక రైల్వేస్టేషన్ ఆవరణలోని వర్షం నీరు నిల్వ ఉందని, అధికారులు స్పందించి వెంటనే తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఎపి పౌర సమాఖ్య కన్వీనర్ బొడ్డేపల్లి మోహనరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నిల్వ నీటిని సోమవారం పరిశీలించారు. నీరు నిల్వ ఉండటం వల్ల దుర్గంధం వెదజల్లి పౌరుల ఆరోగ్యంపై ప్రభావం చూపుతోందన్నారు. తద్వారా పర్యావరణం దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ల అలసత్వం వల్ల అండర్ టన్నెల్‌లో, రైల్వే స్టేషన్ ఆవరణలోని వర్షం నీరు నిల్వ ఉండడంతో అనతి కాలంలోనే మరమ్మతులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా స్టేషన్ ఆవరణలోని పారిశుధ్యాన్ని మెరుగుపరిచి ప్రయాణికులు, పౌరుల ఆరోగ్యాన్ని కాపాడాలని రైల్వే అధికారులను కోరారు.

ప్రజాస్వామ్య వ్యవస్థలో చీకటి రోజు


సమావేశంలో మాట్లాడుతున్న గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

ప్రజా ప్రతినిధుల స్వేచ్ఛను హరించే విధంగా వైసిపి ప్రభుత్వం తెచ్చిన జిఒ నంబరు 1పై చర్చ కోరితే టిడిపి నాయకులపై దాడులకు పాల్పడడం సిగ్గుమాలిన చర్యగా భావిస్తున్నామని, దీనిని ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇదో చీకటి రోజు అని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. పలాస టిడిపి కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇలాంటి వారిని శాసనసభకు పంపించామా అని ప్రజలు సిగ్గుపడేలా వైసిపి నాయకులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత ఎమ్మెల్యే బలవీరంజనేయ స్వామిపై శాసనసభ సాక్షిగా జరిగిన దాడిని రాష్ట్రంలో రాజకీయ పరిజ్ఞానం ఉన్న ప్రతిఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. దీనిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కోరారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి విఠల్, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, మండల పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, సురాడ మోహనరావు, కుత్తుమ లక్ష్మణ కుమార్ పాల్గొన్నారు.

కొత్తూరు : అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాలు నిర్వహిస్తున్న సందర్భంగా ప్రజా సమస్యలపై మాట్లాడుతున్న ఎమ్మెల్యేలపై వైసిపి ఎమ్మెల్యే దాడి చేయడం సరికాదని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ అన్నారు. మాతలలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఇటీవల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితాల్లో టిడిపి బలపర్చిన అభ్యర్థులు గెలుపొందడంతో వైసిపి ఎమ్మెల్యే ఓర్వలేక దాడులకు పాల్పడ్డారని విమర్శించారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల రెండో ఏడాది సిఎస్ఇ విభాగానికి చెందిన 215 మంది విద్యార్థులకు రాష్ట్ర నైపుణాభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యాన సిఎంఎస్ ఎక్సెన్స్ ల్యాబ్లో 'డేటా ఎనాలసిస్ యూజింగ్ పైతాన్'పై సోమవారం శిక్షణా తరగతులు నిర్వహించామని కళాశాల డైరెక్టర్, ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ శిక్షణ ఏప్రిల్ పది వరకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఎక్స్పోజర్టు డేటా మేనిపులేషన్ యూజింగ్ సంఫీ, ఎక్స్పోజర్ టు డేటా ఎనలైసిస్ యూజింగ్ పండాస్, క్లీనింగ్ యూజింగ్ పండాస్, ఎక్స్పోజర్ టు డేటా విజుయులైజేషన్ యూజింగ్ మెట్ ప్లోటిలిబ్, ఎక్స్పోజర్ టు డేటా విజులైజేషన్ యూజింగ్ సీబోర్న్ అనే అంశాలపై ఎపిఎస్ఎస్‌ఎసి ట్రైనర్, తామాడ శ్రీకన్య సాంకేతిక శిక్షణ అందిస్తారన్నారు. ఈ శిక్షణ వల్ల విద్యార్థులకు నైపుణ్యతలు పెరిగి ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, సిఎస్‌ఒ హెచ్‌ఐడి డాక్టర్ యు.డి.ప్రసన్న, ఎపిఎస్ఎస్‌ఎసి స్పోక్ డాక్టర్ వి.అశోక్ కుమార్, బ్రాంచి కో-ఆర్డినేటర్ జి.ఎస్.పవన్‌కుమార్ పర్యవేక్షిస్తారని తెలిపారు.


శిక్షకులతో నాగేశ్వరరావు

జిఒ1ను రద్దు చేయాలి

కవిటి: జిఒ నంబరు 1ను తక్షణమే చేయాలని టిడిపి స్టేట్ యూత్ మీడియా కో-ఆర్డినేటర్ సంతోషపట్నాయక్ ఒక ప్రకటనలో ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. జిఒ నంబరు 1 రద్దుతో పాటు అంగన్వాడీల డిమాండ్లకు టిడిపి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలను అక్రమంగా అరెస్టు చేయడం అన్యాయమన్నారు. దీన్ని తీవ్రస్థాయిలో ఖండిస్తున్నట్లు తెలిపారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి నిరంకుశ పాలనలో ప్రజలు నలిగిపోతున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

జీవ వైవిధ్యానికి పిచ్చుకలు దోహదం

పలాస : మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ పిచ్చుక దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. పాఠశాలలోని జాతీయ హరిత దళం క్లబ్, జూనియర్ రెడ్‌క్రాస్ క్లబ్‌ల ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు పిచుక ఆకారంలో కూర్చుని సేవ్ బర్డ్స్ అనే నినాదంతో మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు, ఎన్‌జిసి క్లస్టర్ కో-ఆర్డినేటర్ కొయ్యల శ్రీనివాసరావు, పాధ్యాయులు పాల్గొన్నారు.


పొందూరు : విద్యార్థులు వేసిన చిత్రలేఖనంతో ప్రిన్సిపాల్ సౌమ్య

పొందూరు: జీవవైవిధ్యానికి పిచ్చుకలు ఎంతో దోహదపడతాయని, వాటిని సంరక్షించాల్సిన అవసరం ప్రతిఒక్కరిపైనా ఉందని కెజిబివి ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య అన్నారు. మండలంలోని లోలుగులో జాతీయ పిచ్చుకల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు చిత్రలేఖన పోటీలను నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని బుడుమూరు ఉన్నత పాఠశాలలో పిచ్చికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానోపాధ్యాయులు ఉరిటి శ్రీనివాసరావు అధ్యక్షతన విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. అనంతరం ఎన్‌జిసి కో-ఆర్డినేటర్ పూజారి గోవిందరావు పర్యవేక్షణలో గ్రామ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పిచ్చుకలను కాపాడండి... ప్రకృతిని రక్షించండి అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.ఎస్.ప్రసాద్, కె.వెంకటరావు, కె.చినపెంటయ్య, కె.ఎస్.బేగమ్, ఎం.అనురాధ, ఎం.రమేష్ పాల్గొన్నారు.


లావేరు : ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు


రికార్డులను పరిశీలిస్తున్న ఆర్మీ అధికారులు

మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తమిళనాడు రాష్ట్రంలోని వెల్లింగ్‌టన్‌లో ఉన్న మద్రాస్ రెజిమెంట్ సెంటర్‌లో పనిచేస్తూ... ఉద్యోగ విరమణ పొందిన మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు రికార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని జెసిఒ బృందం సభ్యులు సుబేదార్ ఆదినారాయణ, హవాల్దార్‌లు మహేష్, అనీష్ అన్నారు. జిల్లా సైనిక సంక్షేమ భవనంలో మాజీ సైనికుల సమస్యలపై సోమవారం చర్చించారు. ముందుగా ఈ బృందానికి మాజీ సైనికుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు కటకం స్వాగతించారు. రెజిమెంట్ పరిధిలో పనిచేసిన మాజీ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు పార్టు-2 ఆర్డర్ పబ్లికేషన్‌లో తేడా, వారి పెన్షన్ వివరాల్లో వ్యత్యాసం, డెత్ పబ్లికేషన్స్ తదతర సమస్యలపై వినతులను స్వీకరించారు. కార్యక్రమంలో మాజీ సైనికుల సమాఖ్య జిల్లా చైర్మన్, గ్రూప్ కెప్టెన్ పి.ఈశ్వరరావు, గౌరవ అధ్యక్షుడు బి.సంజీవరావు, వైస్ ప్రెసిడెంట్ వి.సూర్యనారాయణ, పలాస ప్రెసిడెంట్ హవాల్దార్ ఐ.ఎం.రావు, జనరల్ సెక్రటరీ ఎస్.రామారావు, జాయింట్ సెక్రటరీ పి.మురళీధరరావు పాల్గొన్నారు.

తిరుపతి సాహితీ బ్రహ్మోత్సవాలకు పిలుపు

ప్రజాశక్తి- రణస్థలం

ఏప్రిల్ 9,10 తేదీల్లో తిరుపతిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు సాహిత్య బ్రహోత్సవాలకు ఆసక్తి గల కలువు, కళాకారులు పాల్గొవాలని ప్రపంచ తెలుగు సాహితీ బ్రహోత్సవ కమిటీ ఆర్గనైజర్ మహ్మద్ రఫీ (ఈవేమన) ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శ్రీశ్రీ కళా వేదిక అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యాన జేచర్ల ఇంద్రాణి ఛారిటబుల్ ట్రస్టు సహకారంతో ఈ బ్రహోత్సవాలను నిర్వహిస్తున్నారని తెలిపారు. శ్రీశ్రీ కళా వేదిక తిరుపతి మహతి కళాక్షేత్రంలో 48 గంటల పాటు నిర్విరామంగా నిర్వహించే కార్యక్రమ వేదికపై ప్రతిభను ప్రదర్శించాలన్నారు. వారందరికీ ప్రశంసపత్రం, జ్ఞాపిక, దుశ్శాలువతో సత్కారాలు ఉంటాయని అన్నారు. జిల్లాలోని కవులు, కళా కారులు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 7893451307 సెల్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.


పీడీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని ఆంపురం పంచాయతీలో ఖాళీగా ఉన్న ఫీల్డ్ అసిస్టెంట్ పోస్టును తక్షణమే భర్తీ చేయాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజును సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆంపురం పంచాయతీ నూతనంగా ఏర్పాటైందని అన్నారు. మేట్లతో ఉపాధి పనులు చేస్తున్నామని, ఫీల్డ్ అసిస్టెంట్ లేకపోవడంతో కొన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అన్నారు. అలాగే రాజకీయాలకు అతీతంగా ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలని కోరారు. కార్యక్రమంలో వాబ జగన్, నేలబంతు రవికుమార్, బి.పోలయ్య, కె.లక్ష్మమ్మ, జి.సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కులపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యక్తికి రాజ్యాంగబద్ధంగా సంక్రమించిన హక్కులను పరిరక్షించుకోవడం, ఇతరుల హక్కులకు భంగం వాటిల్లకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు అన్నారు. నగరంలోని శాంతా కళ్యాణ అనురాగ నిలయాన్ని హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ప్రతినిధులు మంత్రి శ్యాంప్రసాద్, కోశాదికారి మాధవీగణపతి అధ్యక్షతన సోమవారం మానవ హక్కులపై ప్రస్తావించారు. సమావేశంలో బలివాడ మల్లేశ్వరరావు, పి.వైకుంఠరావు, కల్లేపల్లి సోమసుందరం, పి.ఎస్.ప్రసాదరావు, ప్రకాశరావు, నరసింహమూర్తి, చిన్మయరావు, సంతోష్ పాల్గొన్నారు.

నీటిఎద్దడి నివారణకు చర్యలు


కవిటి : మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి- కవిటి

వేసవి కాలంలో ప్రజలకు తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపిడిఒ సూర్యనారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో పనిచేయని తాగునీటి బోర్లు సమాచారం తక్షణమే అందించి వాటికి మరమ్మతులు చేయాలని సూచించారు. మండలంలో పాదచారులు, ప్రయాణికుల కోసం పూర్తిస్థాయిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలన్నారు. మండలంలో ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య ఉండకూడదని, దానికోసం అధికారులు పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మరోవైపు ప్రభుత్వం రూపొందించే ప్రతి యాప్‌నూ సిబ్బంది డౌన్ లోడ్ చేసుకుని, వాటిని ఉప యోగించుకోవాలని అన్నారు. సమావేశంలో ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, ఎపిఎం గోవిందరావు పాల్గొన్నారు.

జలుమూరు: రానున్న వేసవిలో మండలంలోని 40 పంచాయతీల పరిధిలో నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపిడిఒ జి.వి.రవికుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సచివాలయ సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా పంచాయతీల కార్యదర్శులూ నీటిఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే నీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేశామన్నారు.


జలుమూరు : మాట్లాడుతున్న ఎంపిడిఒ రవికుమార్

ఇచ్ఛాపురం : గ్రామ పంచాయతీలో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఎంపిడిఒ రామారావు అధికారులకు ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులతో సమీక్షించారు. తాగునీటి స్కీం, ఆధార్ మొబైల్ క్యాంపు, పోర్టల్ సర్వీసెస్, పంచాయతీ రికార్డులన్నీ సక్రమంగా నిర్వహించాలని సూచించారు.



వజ్రపుకొత్తూరు : ర్యాలీ నిర్వహిస్తున్న సభ్యులు



కవిటి : ర్యాలీ నిర్వహిస్తున్న సంస్థల సభ్యులు

చిరుధాన్యాలతో ఆరోగ్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

తక్కువ ఖర్చుతో ఆరోగ్యాన్ని అందించే చిరు ధాన్యాలు పండించేందుకు రైతులు ముందుకు రావాలని సేవా సమితి సభ్యులు డి.ప్రకాష్ కోరారు. చిరు ధాన్యాల మహోత్సవాలో భాగంగా జీడి ఉత్పత్తిదారుల సంస్థ, యంగ్ స్టార్ హెల్పింగ్ హేండ్స్ అసోసియేషన్, ఉద్దానం అభ్యుదయ సేవా సమితిల ఆధ్వర్యాన సోమవారం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ నీటి వినియోగంతో ఆరుతడిగా రాగులు, సజ్జలు, సామలు, ఉలవలు, మినుము, పెసర సాగు చేయడానికి రైతులు శ్రద్ధ చూపాలన్నారు. మధుమేహం, బిపి వంటి దీర్ఘకాలిక వ్యాధులను అదుపులో ఉంచే గుణం చిరు ధాన్యాలకు ఉంటుందన్నారు. చిరు ధాన్యాలు సాగు చేసే రైతులను ప్రభుత్వం రాయితీలు అందించి ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో చింత కాంతమ్మ, కొంకి మోహిని, ఎం.మహేష్, బి.కాంతమ్మ, తామాడ లక్ష్మణరావు, కోల కృష్ణారావు పాల్గొన్నారు.

కవిటి: చిరుధాన్యాలతో ఆరోగ్యానికి ఎంతోమేలని మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంస్థ అధ్యక్షుడు కాయ బీనసేన్ అన్నారు. అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంలో భాగంగా వెలుగు రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యాన కపాసుకుద్దిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. రాబోయే రోజుల్లో మన ఆహారంలో చిరు ధాన్యాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో మత్స్యకార రైతు ఉత్పత్తిదారుల సంస్థ కార్యవర్గ సభ్యులు, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మి, రామయ్య, తేజ, మత్స్యకారులు పాల్గొన్నారు.


సోంపేట : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు


ఇచ్ఛాపురం : ర్యాలీ నిర్వస్తున్న వైద్య సిబ్బంది

నోటి పరిశుభ్రతపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- సోంపేట

ప్రపంచ నోటి పరిశుభ్రత దినోత్సవం పురస్కరించుకొని బారువ ఆస్పత్రి వైద్యులు హుస్సేన్ అధ్యక్షతన అవగాహనా ర్యాలీ నిర్వహించారు. లలిత ఛారిటబుల్ ట్రస్టు, బారువ ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. నోటి పరిశుభ్రతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం బరువ ఆస్పత్రి నుంచి వైద్య ఆరోగ్య సిబ్బందితో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరూ దంత సంరక్షణపై శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రపంచ నోటి పరిశుభ్రతపై దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రి వైద్యులు అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ప్రతిఒక్కరికీ నోటి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే అనారోగ్యం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.అనుషా, డాక్టర్లు దేవేంద్ర, రమేష్‌నాయడు, రాజశేఖర్, సాయికిరణ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

23న జీడితోట వేలం పాట

పోలాకి: ఈ నెల 23న కోడూరు రెవెన్యూ పరిధిలోని జీడి తోట వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కోడూరు పరిధిలోని జీడి తోట ఏడాది పంట అనుభవించేందుకు మధ్యాహ్నం రెండు గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల వారు రూ.30 వేలు ధరామత్, అలాగే రూ.లక్ష ఎస్‌బిఐలో చెల్లుబాటు అయ్యే విధంగా డిడి పట్టుకొని హాజరు కావాలని కోరారు. అలాగే వేలాం పాట అనంతరం ఖరారైన మొత్తం సొమ్మును చెల్లించాలని లేని యెడల రద్దు చేస్తామన్నారు. ధరావత్ డబ్బులు తిరిగి ఇవ్వమని తెలిపారు.


పరిశీలిస్తున్న తిరుపతిరావు

ప్రకృతి వ్యవసాయం ముద్దు

బూర్జ: ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు వస్తాయని అదనపు జిల్లా ప్రాజెక్టు అధికారి తిరుపతిరావు అన్నారు. మండలంలోని పాలవలసలో సాగవుతున్న ప్రకృతి వ్యవసాయాన్ని సోమవారం పరిశీలించారు. ముందుగా యూనిట్‌లోని ఆర్‌డిఎస్ కాంపాక్ట్ బ్లాకుల్లోని కూరగాయల మోడల్స్‌ను నిశితంగా పరిశీలించారు. అలాగే పిఎండిఎస్ నవధాన్యాల విత్తన కిట్లు, ప్రకృతి వనరుల కేంద్రంలో ఉన్న కాషాయాలు, ఉత్పత్తులను పరిశీలించారు. అనంతరం పలువురు రైతులతో మాట్లాడి వారి అనుభవాలు అడిగి తెలుసుకున్నారు. రసాయన సంబంధ వ్యవసాయాన్ని నిర్మూలించి ప్రతి ఇంటికీ ప్రకృతి ఆహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో మాష్టర్ ట్రెనర్ చిన్నమ్మడు, యూనిట్ ఇన్‌ఛార్జి గురువు జనార్ధనరావు పాల్గొన్నారు.

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిజిఎం పంకజ్ కుమార్, జిఎం కె.గుండా రావు, మంజు శర్మ, ఆశ శర్మ సోమవారం సందర్శిం చారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ మర్యాదలతో స్వాగతించారు. అనివేటి మండపంలో స్వామి వారి శేష వస్త్రాన్ని కప్పి జ్ఞాపికను సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు అందజేశారు.


ఆధార్ అప్‌డేట్‌ను పరిశీలిస్తున్న ఎంపిడిఒ ఈశ్వరరావు

ఆధార్ నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- పోలాకి

గ్రామ సచివాలయంలో ద్వారా నిర్వహిస్తున్న ఆధార్ కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు సూచించారు. మండలంలోని ప్రియాగ్రహారం, చెల్లాయివలస, మబగాం, డోల, కోడూరు కేంద్రాలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆధార్ అప్‌డేట్‌లో ఏవైనా సమస్యలుంటే వెంటనే పరిష్కరించాలని సిబ్బందిని సూచించారు. అనంరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఈ నెల 29 వరకు ఆధార్ నమోదు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 27న బెలమర, పాలవలస, గాతలవలస, బొద్దాం, ఈదులవలస, గొల్లలవలస, 28, 29 తేదీల్లో కొత్తరేవు, కె.పి.వలస, జడూరు, రహిమానపురం, గుప్పిడిపేట, తలసముద్రం, ఉరజాం, పోలాకి-2 సచివాలయంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న గోవిందరావు

పలువురి ఆర్థికసాయం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో మురికింటిభద్రకు చెందిన లండ వెంకటరావు భార్య విజయలక్ష్మి గుంటూరులో విద్యుదాఘాతానికి మృతి చెందింది. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు, సామాజికవేత్త మామిడి గోవిందరావు సోమవారం బాధిత కుటుంబానికి పరామర్శించారు. అనంతరం రూ.పది వేలు ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్‌లో ఏ అవసరం వచ్చిన తనను సంప్రదిస్తే తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని భరోసానిచ్చారు. కార్యక్రమంలో పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎస్.తిరుపతిరావు, కూర్మారావు, రామస్వామి పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిల రత్తకన్నకు చెందిన సతివాడ హేమాంబర్ ఇటీవల సంభవించిన ప్రమాదంలో గాయపడి పక్షవాతానికి గురయ్యాడు. వైద్యం చేసుకునేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. విషయం తెలుసుకున్న అతని తోటి స్నేహితులు, 1996-97లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఆదుకున్నారు. అందరి వద్ద నుంచి రూ.40 వేలు వసూలు చేసి హేమాంబర్‌కు అందజేశారు.

విద్యార్థులకు మంచి వాతావరణం కల్పించాలి

టెక్కలి రూరల్ : మండలంలోని సీతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 99 మంది విద్యార్థులు పరీక్షలకు సిన్నద్ధమవుతున్నారని హెచ్‌ఎం సత్తారు వేణుకుమారి అన్నారు. ఈ సందర్భంగా రాత్రిపూట ఇళ్లల్లో చదువుతున్న లేనిదీ లేనిది సోమవారం పరిశీలించామని అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు చదువుపై చక్కనైన వాతావరణం, అనుకూల పరిస్థితులు కల్పించాలని తల్లిదండ్రులకు సూచించినట్లు తెలిపారు. ఏటా వంద శాంతం ఉత్తీర్ణత సాధిస్తున్నామని, ఈ ఏడాదీ వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి ఉపాధ్యాయులందరూ కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీతాపురం, గంగన్నపేట, రామకృష్ణాపురం, బొరిగిపేట పాల్గొన్నారు.


విద్యార్థులతో మాట్లాడుతున్న హెచ్‌ఎం వేణుకుమారి